సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం ॥ 4 ॥ జనవరి ॥ 2024



వైద్యారోగ్య శాఖ అప్రమత్తం
కరోనా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రత్యేక పడకలు, ఐసోలేషన్ సెంటర్లను సిద్ధం చేశారు. 8లో



రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు రెడీ!
రాష్ట్రస్థాయి గిరిజన పాఠశాలల విద్యార్థుల క్రీడాపోటీలకు కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 18°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున మంచు, రాత్రికి చలి ప్రభావం పెరుగుతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా విలాసోత్సవం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో అధ్యయనోత్సవాల్లో భాగంగా విలాసోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని మంగళవాయిద్యాలు, భక్తుల శ్రీరామ నామస్మరణల నడుమ పల్లకీ సేవగా దసరా మండపానికి తీసుకొచ్చారు. అక్కడ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం, హారతి సమర్పించారు. కార్యక్రమంలో మారుతి నర్సింగ్ కళాశాల యాజమాన్యం ఎస్. ఎల్. కాంతారావు, డాక్టర్ సుబ్బరాజు, రమేష్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రమణీయంగా రామయ్య నిత్యకలాణం..
శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
భద్రాచలంటౌన్: దసరా మండపంలో నిర్వహిస్తున్న విలాసోత్సవాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. లవకుశ నాటకం, చిన్నారుల భరత నాట్యం, రామాయణ పాటల కచేరీలు ఆకట్టుకున్నాయి. ప్రజలు భారీగా హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

నాణ్యమైన ఓటరు జాబితాకు సహకరించండి

అదనపు కలెక్టర్ రాంబాబు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేట : లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నాణ్యమైన ఓటరు జాబితా రూపకల్పనకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఆయా పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పు చేర్పులకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు, వార్డు, బూత్ మార్పు, కొత్త ఓటర్ల నమోదుకు నిబంధనలకు లోబడి సహకారం అందించాలన్నారు. సమావేశంలో పార్టీల నాయకులు సయ్యద్ సలీం, ఎస్‌కే పాషా, తుమ్మా రాంబాబు, నర్రా రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

'యూడైస్'ను తనిఖీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ఎంఈఓలు ఆయా మండలాల్లోని 25 శాతం పాఠశాలల్లో యూడైస్ కార్యక్రమాలను తనిఖీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి ఆదేశించారు. ఎంఈఓలు, సీఆర్‌పీలు, మండల ఆపరేటర్లతో బుధవారం ఆయన జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను అందరూ నమోదు చేసేలా చూడాలని, బడి బయట పిల్లల సర్వేలో భాగంగా డ్రాప్ బాక్స్‌లో ఉన్న విద్యార్థుల వివరాలు సేకరించి ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. దివ్యాంగ బాలల సర్వేలో గుర్తించిన పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల లేని హాబిటేషన్ నుంచి వస్తున్న విద్యార్థులకు రవాణా ఖర్చులు అందించేందుకు అవసరమైన వివరాలు వెంటనే పంపాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు, ప్లానింగ్ కో ఆర్డినేటర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పరిశ్రమల ఊసేది?

జిల్లాలో మందకొడిగా పారిశ్రామిక పురోగతి

- జాడలేని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
- ఉలుకూ పలుకూ లేని అధికారులు
- స్థలాల ఎంపిక, ప్రోత్సాహకాల్లో నిర్లిప్తత



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంటేనే ప్రకృతి వనరులకు పుట్టినిల్లు. దట్టమైన అడవులు, అపారమైన ఖనిజ సంపద, గలగల పారే నదులతో అలరారే ప్రదేశం. అన్ని అనుకూలతలు ఉన్నా అధికారులు, పాలకుల నిర్లక్ష్య వైఖరితో పారిశ్రామిక ప్రగతి ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు.

సాకులతో సరిపెడుతున్నారు..
పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహజ వనరులు ఉన్నా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎక్కువగా రాకపోవడానికి ప్రధాన కారణంగా జిల్లాలో మేజర్ ప్రాంతం 1/70 చట్టం పరిధిలో ఉండటమేననే వాదన తరచూ వినిపిస్తోంది. 1/70 కారణంగా ఇక్కడి స్థలాలు గిరిజనేతరుల పేరున రిజిస్ట్రేషన్ కాకపోవడం, బ్యాంకులు రుణాలు మంజూరు చేయకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. అయితే వీటిని అధిగమిస్తూ ఏ రకమైన పారిశ్రామిక విధానం జిల్లాకు అవసరం, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు జిల్లా అధికారుల వద్ద ఎలాంటి ప్రణాళిక లేదనే అపవాదు ఉంది.

అనువైన స్థలం ఉన్నా..
కొత్తగూడెం పట్టణం నడిబొడ్డున దశాబ్దాల క్రితమే వందల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేశారు. ఇందులో పరిశ్రమలు స్థాపిస్తామంటూ అనేక మంది స్థలాలు లీజుకు పొందారు. కానీ తీసుకున్న లీజుకు, వచ్చిన పరిశ్రమలకు మధ్య పొంతన లేదు. అలాగే కొందరు తూతూ మంత్రంగా యూనిట్లు స్థాపించి ఆ తర్వాత మూలనపడేశారు. వీటన్నింటినీ లెక్క తీస్తే కొత్తగూడెం ఇండస్ట్రియల్ ఏరియాలో కొత్త పరిశ్రమలకు అవసరమైనంత స్థలం అందుబాటులోకి వస్తుంది. అలాగే పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోనూ ఇలా పరిశ్రమల పేరుతో స్థలాలను రాజకీయ నాయకులకు లీజుకు ఇచ్చారు. వీటితో పాటు సింగరేణి లీజు నుంచి ప్రభుత్వానికి వచ్చినవి, ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తే జిల్లా కేంద్రంలోనే పారిశ్రామిక అవసరాలకు తగ్గ స్థలాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు.

ఎక్కడి గొంగళి అక్కడే..
గత ప్రభుత్వ హయాంలో ప్రతీ నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగా జిల్లాలో ఇల్లెందు మండలం లచ్చగూడెం, అశ్వాపురం మండలం గొందిగూడెం, అశ్వారావుపేట పరిధిలోని తిరుమలకుంటలో ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. భద్రాచలంలో స్థలం లభించలేదు. కొత్తగూడెం పరిధిలోనూ పరిశ్రమలకు అవసరమైన ప్రభుత్వ స్థలాలు లేవని తేల్చేశారు. చివరకు ఇల్లెందు పరిధిలో పరిశ్రమల స్థాపనకు రేపో మాపో శంకుస్థాపన చేస్తారనే అభిప్రాయం వ్యక్తమైంది. అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ సైతం ఈ విషయంపై ధీమా వ్యక్తం చేశారు. కానీ అటు రాజకీయ చొరవ, ఇటు జిల్లా అధికారుల నుంచి క్రియాశీలత కరువవడంతో కొత్త పరిశ్రమల స్థాపన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది.

పేరుకే పెద్ద పరిశ్రమలు..
సింగరేణి బొగ్గు గనులు, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, హెవీ వాటర్ ప్లాంట్, పామాయిల్ ఫ్యాక్టరీల వంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ఐటీసీ, నవభారత్ వంటి భారీ పరిశ్రమలు జిల్లాలో ఉన్నాయి. ఇక్కడ పెడుతున్న పెట్టుబడి, అందుతున్న ఉపాధిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో పారిశ్రామిక ప్రగతి బాగానే ఉన్నట్టు కనిపిస్తుంది. కానీ ఇవన్నీ వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి, భారీ యంత్రాలతో ఉత్పత్తిని సాధించే పరిశ్రమలు. వనరులు ఉన్న చోట సహజంగానే ఈ తరహా పరిశ్రమలు ఏర్పాటవుతాయి. కానీ తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమల జాడ జిల్లాలో అంతంతమాత్రమే. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం పరిధిలో ఉన్న పేపర్ ఆధారిత పరిశ్రమలను మినహాయిస్తే, తెలంగాణ వచ్చిన తర్వాత గర్వంగా చెప్పుకునే పారిశ్రామిక విధానం, టీఎస్ ఐ పాస్ ద్వారా కూడా జిల్లాకు పరిశ్రమలు రాలేదు.

తుమ్మల పైనే భారం..
జిల్లాకు చెందిన తుమ్మల నాగేశ్వరరావు ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే కార్యక్షేత్రంలోకి దిగారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పామాయిల్ పరిశ్రమల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అందులో ఒకటి భద్రాద్రి జిల్లాలో కాగా మరొకటి ఖమ్మం జిల్లాకు కేటాయించారు. ఇదే ఒరవడితో జిల్లాలో వృద్ధి చెందుతున్న వ్యవసాయ రంగానికి అనుబంధంగా మరిన్ని పరిశ్రమలు స్థాపించేలా తుమ్మల చొరవ చూపాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ఆగస్టు నాటికి నీరందించాలి


సీతారామ టన్నెల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక ఆల తదితరులు

- వేసవిలో మట్టి పనులు పూర్తి చేయండి
- పరిహారం చెల్లింపుపై కలెక్టర్లను సంప్రదించాలి
- సీతారామ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

అశ్వారావుపేట : సీతారామ ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆగస్టు నాటికి సాగునీరు అందించాలని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని సీతారామ లిఫ్ట్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి కాలంలో మట్టి పనులు పూర్తి చేయాలని, మిగిలిన పనులు వర్షాకాలంలో చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో కూడా కాల్వలు తవ్వే పనులు వేసవికి ముందే పూర్తి చేయాలన్నారు. ఈ క్రమంలో రహదారులు, రైల్వే లైన్లు, అటవీ భూములు, పోడు భూములు, గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూముల వంటివి ఏవి ఉన్నా నిర్వాసితులకు పరిహారం కోసం ఉమ్మడి జిల్లాల కలెక్టర్లను సంప్రదించాలని చెప్పారు. కేంద్రం లేదా రాష్ట్రంలో ఏ ప్రభుత్వ శాఖ అనుమతి కావాలన్నా తనను కలవాలని, సంబంధిత మంత్రిత్వ శాఖతో చర్చించి సకాలంలో సాధిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం మ్యాప్ ద్వారా అధికారులు పనుల పురోగతిని వివరించారు. టన్నెళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించే ఏజెన్సీలను సంప్రదించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు. రూ.7,500 కోట్లు వెచ్చించినా ఇంకా పనుల్లో జాప్యం తగదన్నారు. ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ఏం చేయాలో ఆలోచించి ముందుకు సాగాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో టన్నెళ్ల నిర్మాణం, జెన్‌కో టెండర్లు, పంపుల నిర్మాణం సంబంధిత అంశాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఈ ఏడాది 1.50 లక్షల ఎకరాలకు నీరు..
సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది 1.50 లక్షల ఎకరాలకు, వచ్చే ఏడాది మరో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రి తుమ్మల వివరించారు. ప్రాజెక్టు పరిశీలన అనంతరం ఆయన అక్కడే విలేకరులతో మాట్లాడారు. గోదావరి నది పోలవరం ప్రాజెక్టు వద్ద ఉన్న ఫుల్ రిజర్వాయర్ లెవల్‌కు సమానంగా ప్రాజెక్టు ఎత్తును నిర్వహించడం ద్వారా ఎంత పెద్ద ఉప్పెన వచ్చినా తెలంగాణలో ముంపు ఏర్పడదని అధికారులు చెప్పారు. అనంతరం ఖమ్మం ఔటర్ రింగ్ రోడ్ ప్రతిపాదనలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా కొత్త కలెక్టరేట్‌కు ఇబ్బంది కాకుండా, మరెవరికీ ఆటంకం కలుగకుండా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దమ్మపేట మండలం పూసుకుంట గ్రామంలో కొండరెడ్లు 80 ఏళ్ల క్రితం నుంచి ఉంటున్నారని.. వారు అంతరించిపోతున్న తెగగా గుర్తించబడ్డారని.. వారికి రవాణా సౌకర్యం కోసం గతంలోనే తాను రూ.30 కోట్ల ఎల్‌డబ్ల్యూఈ నిధులను మంజూరు చేశానని కలెక్టర్ ప్రియాంక ఆలకు గుర్తు చేశారు. సంబంధిత అధికారులతో చర్చించి ఆ నిధులు వెనక్కు మళ్లకుండా వారికి రహదారి సౌకర్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సీఈ ఎ. శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈలు ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అశ్వారావుపేట ఈఈ సురేష్‌కుమార్, డీఈఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీగా రోహిత్ రాజు

మాదాపూర్ డీసీపీగా వినీత్ బదిలీ


నూతన ఎస్పీ రోహిత్ రాజు


బదిలీ అయిన ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్ : జిల్లా ఎస్పీగా బిరుదురాజు రోహిత్‌రాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్‌కు చెందిన రోహిత్ రాజు 2018 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. తొలి పోస్టింగ్ భద్రాద్రి జిల్లాలోనే వచ్చింది. భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ ఏఎస్పీగా 2022 జూన్ వరకు జిల్లాలోనే విధులు నిర్వహించారు. జూలై 1న జరిగిన బదిలీల్లో హైదరాబాద్ సౌత్ ఈస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లారు. తిరిగి బుధవారం జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. ఏఎస్పీగా అంకితభావంతో పనిచేశారని, అందరితోనూ కలిసి పోయేవారని మంచి పేరు సంపాదించుకున్నారు. కాగా, ప్రస్తుత ఎస్పీ డాక్టర్ వినీత్‌ను మాదాపూర్ డీసీపీగా బదిలీ చేశారు. గతంలో ఇక్కడ ఎస్పీగా పనిచేసి ప్రస్తుతం హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి అటాచ్‌గా ఉన్న సునీల్‌దత్‌ను ఖమ్మం సీపీగా నియమించారు.

స్కానింగ్ సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి

కొత్తగూడెంరూరల్ : జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల జిల్లా వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో అబార్షన్లు తగ్గేలా చూడాలని సూచించారు. చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, ప్రోగ్రామ్ అధికారి చైతన్య, డీపీఆర్‌ఓ శ్రీనివాసరావు, డిప్యూటీ డెమోలు ఎండీ ఫైజ్ మొయినుద్దీన్, నాగలక్ష్మి, బేబి పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

దమ్మపేట: మండల పరిధిలోని మొండివర్రె గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రియాంక ఆల బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమానికి ముందు అధికారులు ఇంటింటికీ వచ్చి దరఖాస్తు ఫారాలు ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు పూర్తిచేయలేని వారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు మాధవి, శ్రీనివాసరావు, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ కీసర లక్ష్మి పాల్గొన్నారు.

కొత్తగూడెంలో అదనపు కలెక్టర్...
కొత్తగూడెంఅర్బన్: వార్డు సభల నిర్వహణ తీరును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు పరిశీలించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 19, 23 వార్డుల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేశారు.. ఎన్ని దరఖాస్తులు అందుబాటులో ఉంచారని అధికారులను ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. నిర్దేశించిన పథకాలతో పాటు ఇతర అంశాలపైనా ప్రజలు అందించే దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత అంశాలపై కూడా అర్జీలు అందించవచ్చని తెలిపారు. ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవనాథ జీయర్ స్వామికి ఘన స్వాగతం


జీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

చర్ల: శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామికి బుధవారం చర్లలో భక్తులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ సెంటర్ నుంచి శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ స్వామి వారి ఆలయానికి శోభాయాత్రగా వచ్చారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ చరిత్రను భక్తులకు వివరించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను భక్తులను పంపిణీ చేశారు. అంతకు ముందు చర్ల బస్టాండ్ సమీపంలో రూ. కోటితో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ పనులను జీయర్ స్వామి పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, నాంపల్లి సాగర్, పెద్దాడ ఆశాలత, అయ్యంగిరి నాగేశ్వరరావు, మచ్చా వీర్రాజు, ఎడారి శ్రీను, గంజి పురుషోత్తం, కోటి రమేష్, చిత్తూరి వినోద్, గద్దం మోహనాచారి పాల్గొన్నారు.

నామినేటెడ్ సం'క్రాంతి'

- పండుగ లోపు పోస్టుల భర్తీకి కసరత్తు!
- కాంగ్రెస్ ఆశావహుల్లో ఉత్సాహం
- ఉమ్మడి జిల్లా నుంచి పోటీలో పలువురు
- మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల చుట్టూ ప్రదక్షిణ



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పోస్టుల సందడి నెలకొంది. సంక్రాంతి పండుగలోగా పోస్టులను భర్తీ చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఆశావహులు ఉత్సాహంగా ఉన్నారు. ఇదే సమయాన ఉమ్మడి జిల్లా నుంచి ఎవరెవరికి అవకాశం దక్కుతుందనే చర్చ మొదలైంది. ఆశావహులు పలువురు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పార్టీకి తాము చేసిన సేవలు, ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి చేసిన కృషిని వివరిస్తూ నామినేటెడ్ పోస్టు ఇప్పించాలని కోరుతున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రధాన నామినేటెడ్ పోస్టులకు జిల్లా నుంచి ఎక్కువ మంది పోటీ పడుతుండడంతో తొలి విడతగా ఎవరికి పదవులు కట్టబెడతారనే ఉత్కంఠ నెలకొంది.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన..
మార్చిలోగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయనే ప్రచారంతో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసి క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న నేతల వివరాలను టీపీసీసీ సేకరిస్తోంది. ఆయా నేతలకు గల జనబలం, పార్టీలో ఎప్పటి నుంచి ఉన్నారు.. తదితర అంశాలను బేరీజు వేస్తూ జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ జాబితా ఆధారంగా సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా మంత్రులతో చర్చించాక ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. రాష్ట్ర స్థాయిలో ఉన్న నామినేటెడ్ పోస్టుల్లో ప్రధానమైనవి తొలుత భర్తీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. అలాగే, ఉమ్మడి జిల్లాలో ముఖ్యమైన నామినేటెడ్ పోస్టులు కొన్నింట్లో స్థానిక నేతలను నియమిస్తారని తెలుస్తోంది. తద్వారా లోక్‌సభ ఎన్నికల్లో నాయకులంతా ఏకతాటిపై నడిస్తే మెజార్టీ స్థానాలు పార్టీ దక్కుతాయనే అంచనాల్లో ఆ పార్టీ పెద్దలు ఉన్నారు.

జాబితా పెద్దదే...
ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలువురు నేతలు నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. వైరా నియోజకవర్గం నుంచి బొర్రా రాజశేఖర్, లోకేష్‌యాదవ్, మధిర నియోజకవర్గం నుంచి పైడిపల్లి కిషోర్, డాక్టర్ కోట రాంబాబు, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, ఖమ్మం నుంచి పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, చావా నారాయణరావు, శెట్టి రంగారావు జాబితాలో ఉన్నారు. అలాగే, కొత్తగూడెం నుంచి నాగా సీతారాములు, కొత్వాల శ్రీనివాసరావు, పినపాక నియోజకవర్గం నుంచి భట్టా విజయ్‌గాంధీ, తుళ్లూరి బ్రహ్మయ్య, ఇల్లెందు నియోజకవర్గం నుంచి రాంరెడ్డి గోపాల్ రెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, వడ్లమూడి దుర్గా ప్రసాద్, మేకల మల్లిబాబుయాదవ్, అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి జూపల్లి రమేష్‌బాబు, ఆలపాటి రామచంద్రప్రసాద్ పదవులు ఆశిస్తున్నారు. ఇక పాలేరు నియోజకవర్గం నుంచి రామసహాయం నరేష్‌రెడ్డి, రామసహాయం వెంకట్‌రెడ్డి, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, శాఖమూరి రమేష్, చావా శివరామకృష్ణ పోస్టులు దక్కించుకోవాలనే యత్నాల్లో ఉన్నారు. ఇందులో చాలా మంది రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులపై ఆశ పెట్టుకోగా.. కొందరు ఉమ్మడి జిల్లా, ఇంకొందరు జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారు. కాగా, ముగ్గురు, నలుగురు నేతలు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టు దక్కకపోతే ఎమ్మెల్సీ కోసం పోటీ పడాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

రాజకీయ భవిష్యత్ కోసం..
నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న నేతలు పలువురు తాము రేసులో ముందున్నామని ప్రచారం మొదలుపెట్టారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులను కలుస్తూ పార్టీ పరంగా చేసిన కార్యక్రమాలు, గతంలో నిర్వహించిన పోస్టుల వివరాలను ఇస్తున్నారు. అలాగే ఏఐసీసీ, టీపీసీసీలో తెలిసిన నేతలను కలిసి నామినేటెడ్ పోస్టుల విషయంలో వారి సహకారం కోరుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఆశావహులు ముగ్గురు మంత్రులతో పాటు పార్టీ పెద్దలనూ కలిశారు. సామాజిక సమీకరణాలను కూడా పరిశీలించి తమకు అవకాశం ఇప్పించాలని కోరినట్లు తెలిసింది. అయితే, తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యాన ఎలాగైనా నామినేటెడ్ పోస్టు దక్కించుకుంటే రాజకీయ భవిష్యత్‌కు ఢోకా ఉండదని ఆశావహులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

కేన్సర్ కణితి తొలగింపు



శస్త్రచికిత్స చేసి కణితి తొలగించిన వైద్యులు

కొత్తగూడెంరూరల్ : జిల్లాలోని సర్వజన ఆస్పత్రి వైద్యులు ఓ మహిళకు శస్త్రచికిత్స నిర్వహించి కేన్సర్ కణితి తొలగించారు. జిల్లా కేంద్రంలోని రామవరానికి చెందిన ఎస్కే ఫాతిమా బేగ్ మూడు నెలలుగా కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, ఆకలి మందగించటం, బరువు తగ్గడం తదితర లక్షణాలతో బాధపడుతోంది. గత నెల 28న కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి రాగా, వైద్యులు పరీక్షించి కడుపులో 7 కేజీల కణితి ఉన్నట్లు గుర్తించారు. బుధవారం శస్త్రచికిత్స నిర్వహించి, తొలగించారు. వైద్యులు సురేందర్, నాగదీప్, శిరీష్, నాగేశ్వరరావు, లతీఫ్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారని ఆస్పత్రి సూపరిటెండెంట్ బోడ కుమారస్వామి తెలిపారు.

ఠాణా నూతన భవనానికి శంకుస్థాపన



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి బుధవారం ఏఎస్పీ పరితోష్ పంకజ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.5 కోట్లతో భవన నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం వినియోగిస్తున్న భవనం నిర్మించి 25 ఏళ్లు గడుస్తుందని, ఈ నేపథ్యంలో కొత్త భవన నిర్మాణానికి 8 నెలల క్రితం ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వివరించారు. ఏడాది కాలంలో నిర్మాణ పనులు పూర్తవుతాయని, కొత్త భవనం అందుబాటులోకి వస్తే సిబ్బందికి, ఫిర్యాదుదారులకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. సీఐ నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఉన్నతాధికారులను కలిసిన జీఎం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులకు సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన కొత్తగూడెంలోని అరణ్య భవన్‌లో సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ కృష్ణగౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువలతో సత్కరించారు. ఆయన వెంట ఎస్ఓటుజీఎం మల్లారపు మల్లయ్య, ఎస్టేట్ అధికారి శివకుమార్ ఉన్నారు.

కిషన్ రెడ్డిని కలిసిన రంగాకిరణ్



చుంచుపల్లి: జిల్లా బీజేపీ అధ్యక్షుడు కె.వి.రంగా కిరణ్ బుధవారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిని హైదరాబాద్‌లోని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి పట్టు వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించినట్లు రంగాకిరణ్ తెలిపారు.

యువతి అదృశ్యం

ఇల్లెందు: పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన యువతి అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 30న అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిందని, పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదని యువతి తండ్రి సీతల ప్రసాద్ పాసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

పాల్వంచలో యువకుడు..

పాల్వంచరూరల్: యువకుడి అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన పోతురాజు పవన్‌కల్యాణ్ గత నెల 25వ ఇంట్లో నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. తన కుమారుడు అదృశ్యం కావడానికి కొర్రసాయి, కృష్ణ, సంత్, బాలాజీ కారణమని పవన్ కల్యాణ్ తల్లి ఫిర్యాదు చేయగా నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

వైద్యారోగ్య శాఖ అప్రమత్తం

- కరోనా వ్యాప్తిని ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం
- జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా 50 పడకల ఏర్పాటు
- ఇద్దరు పల్మనాలజిస్టులతో వైద్య సేవలు



జిల్లా సర్వజన ఆస్పత్రిలో సిద్ధం చేసిన ఐసోలేషన్ సెంటర్

కొత్తగూడెంరూరల్: కరోనా జేఎన్-1 వేరియంట్ వ్యాపిస్తున్న నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటివరకు జిల్లాలో కరోనా కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. అయినా ముందస్తు జాగ్రత్తగా అధికారులు ప్రత్యేక పడకలు, ఐసోలేషన్ సెంటర్లను సిద్ధం చేశారు. కరోనా బాధితుల చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో 50 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశారు. వెంటిలేటర్లు, ఆక్సిజన్ సిలిండర్లు, యాంటీవైరల్స్, యాంటీ బాటిక్స్ మందులు అందుబాటులో ఉంచారు. జ్వర పీడితులకు ప్రత్యేకంగా ఓపీ ఏర్పాటు చేశారు. ఇద్దరు పల్మనాలజిస్టులతో ఓపీ సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో మరో 22 మంది ప్రత్యేక వైద్య నిపుణులు సేవలందిస్తున్నారు. ఎవరికైనా వారం రోజుల పాటు జర్వం తగ్గకపోతే కరోనా పరీక్షలకు రిఫర్ చేస్తున్నారు. జిల్లాలోని భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట, ఇల్లెందు, పాల్వంచ పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధం చేశారు. కాగా జిల్లా కేంద్రంలోని కోవిడ్ పరీక్ష కేంద్రంలో 200 మందికి పరీక్షలు నిర్వహించగా, ఒకరికి కూడా పాజిటివ్ రాలేదు.

అన్ని పీహెచ్‌సీలకు కరోనా కిట్లు



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కిట్లు పంపిణీ చేశాం. అనుమానితులకు కరోనా పరీక్షలు చేస్తాం. కరోనా వచ్చినా భయపడాల్సిన పని లేదు. మెరుగైన వైద్యం అందించేందుకు అంతా సిద్ధం చేశాం. సర్వజన ఆస్పత్రిలో ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు వారం రోజులపాటు ఉంటే కరోనా పరీక్షలు చేయించుకోవాలి.

– శిరీష, డీఎంహెచ్ఓ

జాగ్రత్తలు పాటించాలి



మాస్కులు ధరించటంతోపాటు జన సంచార స్థలాల్లో భౌతిక దూరం పాటించాలి. జర్వం వచ్చినా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలి. కిడ్నీ, షుగర్ సంబంధిత వ్యాధులు ఉన్న వారు, 60 ఏళ్లు వయసు దాటినవారు జాగ్రత్తలు అప్రమత్తంగా ఉండాలి. శానిటైజర్ వాడాలి. జ్వరం వస్తే ఆస్పత్రికి వెళ్లాలి. కరోనా బాధితుకలు వైద్యం అందించేందుకు జిల్లా ఆస్పత్రిని సిద్ధం చేశాం.

– కుమారస్వామి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

కోయగూడెంలో రామాలయ నిర్మాణం

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



రామాలయ శంకుస్థాపన సందర్భంగా పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోరం తదితరులు

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం గ్రామంలో రామాలయ నిర్మాణం చేపడుతున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. బుధవారం కోయగూడెం గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన శ్రీకోదండ రామాలయం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా హోమం, అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కాగా కనకయ్య జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే ఆలయానికి స్థలం కొనుగోలు చేసి, ఆలయ నిర్మాణానికి చొరవ చూపారు. అర్చకుడు వెల్లటూరి ప్రసాదచారి, కోరం లక్ష్మి, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, సర్పంచ్ పూనెం ఉమ, ఎంపీటీసీ జాల సంధ్య, అన్నపురెడ్డిపల్లి శివాలయం ధర్మకర్త మారగాని శ్రీనివాసరావు, సద్గురు డాక్టర్ గాజర్ల వీరభద్రం, కొప్పురావూరి భాస్కర్‌రావు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పూనెం సురేందర్, జాల మురళి, గంగారపు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ, ఖమ్మం జట్లు గెలుపు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న నెహ్రూ కప్ అంతరాష్ట్ర క్రికెట్ పోటీల్లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పాల్వంచ, ఖమ్మం జట్లు విజయం సాధించాయి. ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులకు మొదటి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిచంద్ర, ఎస్ఐ మధుప్రసాద్, డెక్క నరసింహారావు, బాలయోగి, అజీమ్, సలీం, నాగార్జున, శ్రీనివాసరావు, సదానందం, బాలమురళీకృష్ణ, పాషా సలీమ్, శేషబాబు, గోపి, విజయ్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



భూక్య భాస్కర్ (ఫైల్)

టేకులపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై బుధవారం కేసు నమోదైంది. బోడు ఎస్ఐ రంజిత్ కథనం ప్రకారం.. మండలంలోని చింతోనిచెలక పంచాయతీ చిన్న తండాకు చెందిన భూక్య భాస్కర్(42) వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం కూడా గొడవ జరిగింది. అనంతరం ఇద్దరూ కూలి పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చారు. బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన భాస్కర్ రాత్రి 9 గంటలైనా తిరిగి రాలేదు. దీంతో వెతకగా ఇంటి వెనుకాల చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ..

పాల్వంచరూరల్: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ మంగళవారం రాత్రి పత్తిచేనులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని నర్సింహాసాగర్ గ్రామానికి చెందిన కాలం రాజేశ్వరి(24)ని భర్త సామేలు అనుమానించడంతోపాటు నిత్యం తాగి వచ్చి వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఆమె మంగళవారం రాత్రి పత్తి చేనులో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

సుజాతనగర్‌లో వృద్ధుడు..

సుజాతనగర్: పురుగుల మందు తాగి వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటనపై ఠాణాలో బుధవారం కేసు నమోదైంది. ఎస్సై ఎం.సోమేశ్వర్ కథనం ప్రకారం.. పాత అంజనాపురం గ్రామానికి చెందిన కుంచ భూషయ్య(72)కు రూ.2 వేల వృద్ధాప్య పింఛన్ రాగా, రూ.500తో మద్యం తాగాడు. దీంతో భార్యాభర్తల మధ్య వివాదం చోటుచేసుకుంది. మనస్థాపం చెందిన భూషయ్య మంగళవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పత్తి తూకంలో మోసం

- దళారులకు దేహశుద్ధి, నష్ట పరిహారం వసూలు

దుమ్ముగూడెం : మండలంలోని చింతగుప్ప గ్రామంలో పాల్వంచ, అంజనాపురం గ్రామాలకు చెందిన పత్తి దళారులు రిమోట్ కాటాతో తూకంలో మోసం చేశారు. దీంతో బుధవారం గ్రామస్తులు గుర్తించి పట్టుకుని చితకబాది, నష్టపరిహారం వసూలు చేశారు. సుమారు 8మంది పత్తి దళారులు చింతగుప్పతో పాటు చుట్టు పక్కల పత్తి కొనుగోలుకు వచ్చారు. అమాయక గిరిజన ఆదివాసీల నుంచి రిమోట్ కాటాలతో పత్తిని తూకం వేసి నగదు చెల్లించి ఒక ఆటో లోడ్ చేసి పంపించారు. మరో ఆటోలో లోడ్ చేస్తుండగా అనుమానం వచ్చిన రైతులు ప్రశ్నించడంతో తూకంలో మోసం వెలుగుచూసింది. దీంతో దళారులకు దేహశుద్ధి చేసి సుమారు రూ.లక్ష పరిహారం వసూలు చేశారు. రెండు ఆటోలలో సుమారుగా 4 క్వింటాల పత్తిని అధికంగా కాటా వేసినట్టు తెలిసింది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి (55) మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసకుంది. జీఆర్పీ ఎస్సై భాస్కరావు కథనం ప్రకారం ... ఖమ్మం – పందిళ్లపల్లి స్టేషన్ల మధ్య సదరు వ్యక్తి పట్టాలు దాటుతూ రైలును గమనించకపోవటంతో ఢీకొట్టింది. ఈ మేరకు ఆయన మృతదేహాన్ని అన్నం పౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

డ్రెయినేజీలో పడిన వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

ముదిగొండ: ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ముదిగొండ మండలం గంధసిరికి చెందిన మద్రి వెంకటేశ్వర్లు(50) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 1న గ్రామ సెంటర్‌లో జరుగుతున్న నూతన సంవత్సర వేడుకలు చూడడానికి బయలుదేరిన ఆయన ప్రమాదవశాత్తు మార్గమధ్యలోని రహదారి పక్కన ఉన్న మురుగు కాల్వలో పడటంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయనకు ఖమ్మంలో చికిత్స చేయించి మంగళవారం సాయంత్రం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఘటనపై మృతుడి బంధువులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

జాతి వైరం మరిచిన మాతృత్వం



ఇల్లెందు: జాతి వైరం మరిచి ఓ కుక్క పిల్లికూనకు పాలు ఇచ్చిన దృశ్యం ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బుధవారం రాత్రి కనిపించింది. ఆస్పత్రి వద్ద ఓ కుక్క పడుకుని ఉండగా ఆకలితో ఉన్న పిల్లికూన వచ్చింది. కుక్క కూడా పిల్లల తల్లి కావడంతో పిల్లి పాలు తాగేందుకు సిద్ధమైంది. జాతివైరంతో పిల్లిని చూస్తేనే ఆమడదూరం పరుగెత్తించే కుక్క పిల్లి కూనకు పాలు ఇవ్వడం విశేషం.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

దుమ్ముగూడెం : మండలంలోని రేగుబల్లి–సీతారాంపురం గోదావరి నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండగా వారం రోజుల క్రితం అధికారులు నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ బుధవారం ట్రాక్టర్ రూ. 15 వేల చొప్పున రూ. 60 వేలు, జేసీబీకి రూ. 20 వేల చొప్పున యజమానులకు జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేసేలా యజమానులతో లేటర్ రాయించుకున్నారు.

5.5 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడ్డ నిందితులు, గంజాయితో ఎక్సైజ్ అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం వద్ద బుధవారం తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సంపేట ప్రాంతానికి చెందిన మార్తా సాయికుమార్, మహ్మద్ సొహైల్ బైక్‌పై ఏపీలోని సీలేరు నుంచి 5.5 కిలోల గంజాయి తరలిస్తుండగా గుర్తించారు. గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ సర్వేశ్వర్ తెలిపారు.

అయ్యప్ప ప్రసాదం పంచేందుకు వెళ్లి..

- యాష్ ట్యాంకర్ ఢీకొని భక్తుడు మృతి



తేజావత్ సేవా (ఫైల్)

టేకులపల్లి: యాష్ ట్యాంకర్, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన తొమ్మిదోమైలుతండాలో బుధవారం జరిగింది. ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం ... మండలంలోని తొమ్మిదోమైలుతండా గ్రామానికి చెందిన తేజావత్ సేవా(38) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయ్యప్ప దీక్ష చేపట్టిన సేవా మంగళవారమే ద్వారపూడికి వెళ్లి ఇరుముడి సమర్పించి వచ్చాడు. బంధువులకు, స్నేహితులకు ప్రసాదం పంచిపెట్టేందుకు బుధవారం బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో టేకులపల్లి నుంచి ఇల్లెందు వైపు వెళ్తుండగా యాష్ ట్యాంకర్ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సేవా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉషారాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

సుజాతనగర్: మాయమాటలు చెప్పి మైనర్ బాలికను వెంట తీసుకెళ్లిన వ్యక్తిపై పోలీసులు బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూలూరుపాడు మండలానికి చెందిన ఓ బాలిక ఇక్కడ ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. గత నెల 10న తల్లాడ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆమెకు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సోమేశ్వర్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై మహిళల దాడి



సామగ్రి ధ్వంసం చేసిన గ్రామస్తులు

అశ్వాపురం: మండల పరిధిలోని గిరిజన గ్రామమైన వెంకటాపురంలో వంద శాతం గుడుంబా నిషేధానికి గ్రామ మహిళలు, యువత నడుం బిగించారు. గ్రామంలో కొందరు గుడుంబా విక్రయిస్తుండగా మహిళలు, యువకులు బుధవారం స్థావరాలపై మెరుపు దాడి చేశారు. సారా పారబోసి, తయారీ సామగ్రి ధ్వంసం చేశారు. గ్రామంలో నాటు సారా తయారు చేసినా, విక్రయించినా సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడకం సాదు, డ్వాక్రా మహిళలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులే కీలకం

- యాసంగిలో సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- విత్తనాల ఎంపిక, యాజమాన్యంపై అధికారుల సూచనలు



పండితాపురం శివారులో సిద్ధం చేసిన వరి నారుమడి

కామేపల్లి: ప్రస్తుత యాసంగిలో అధిక శాతం రైతులు లావు గింజల వరి సాగునకు మొగ్గు చూపుతున్నారు. మేరకు రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందొచ్చని కారేపల్లి మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్ట్యా స్వల్పకాలిక రకాలైన(పంట కాలం 120 నుంచి 130 రోజులు) బతుకమ్మ, ఎంటీయూ 1010, కేఎస్ఎం 118, ఆర్ఎన్ఆర్ 10754 రకం వరి సాగు మేలని తెలిపారు. చలి తీవ్రత ఆధారంగా పంట కాలం 10 నుంచి 15 రోజుల్లో పెరిగే అవకాశమున్నందున ఆ ప్రభావం నారుమడులపై పడకుండా రైతులు ప్రత్యేక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. తద్వారా నేరుగా వరి విత్తే విధానంతో ఖర్చు తగ్గుతుందని తెలిపారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

చలిని తట్టుకునే రకాలను రైతులు ఎంపిక చేసుకోవాలి. నారుమడిలో మండే కట్టే విధానం పాటించాలి. నారు పోసుకునే ముందు నారు మడిలో సరిపడా రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు, కేజీ జింక్ సల్ఫేట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలి. రాత్రి పూట నారు మడిలో నీరు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తక్కువగా ఉంటుంది. అందువల్ల ప్రతిరోజు ఉదయం, పగటి పూట వెచ్చని బోరు నీటిని నారుమడికి అందించి సాయంత్రం వేళలో తొలగించాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడూ నారుమడి చుట్టూ అడుగు ఎత్తులో పల్చని పాలిథిన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచుల పట్టాలను సాయంత్రం కప్పి ఉదయం తీసివేయాలి. రాత్రి ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్ కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడడడంతో పాటు పోషక లోపం, జింక్ లోపం లక్షణాలు కనిపిస్తాయి. జింక్ లోపం కారణంగా ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు బారి నుంచి నారును కాపాడుకోవడానికి నారు తీయడానికి వారం ముందు ఐదు సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరన్ 3జీ గుళికలు వేయాలి. చలి తీవ్రతతో అగ్గి తెగులు ఆశించే అవకాశముందున్న ముందు జాగ్రత్తగా లీటర్ నీటికి 0.6 గ్రా.ట్రైసైక్లోజోన్‌ను కలిపి పిచికారీ చేయాలి.

జాతీయ పురస్కారానికి ఎంపిక



ప్రభాకరాచార్యులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త సిద్దాంతపు ప్రభాకరాచార్యులు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఏపీలోని అభ్యుదయ రచయితల సంఘం, కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన రాజమండ్రిలో నిర్వహించే పడాల రామారావు శత జయంతోత్సవంలో 'శ్రీ పడాల రామారావు జాతీయ స్మారక పురస్కారం' అందుకోనున్నారు. ఈ మేరకు బుధవారం ఆయా సంఘాల నుంచి ఆహ్వానం అందింది.

హత్య కేసులో నలుగురి రిమాండ్

కారేపల్లి: మండలంలోని రంగురాళ్లబోడు గ్రామంలో గతనెల 29వ తేదీన జరిగిన హత్య ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. రంగురాళ్లబోడుకు చెందిన బానోతు రాజుపై పాతకక్ష్యల నేపథ్యాన కత్తితో దాడి చేయగా తీవ్రంగా గాయపడి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స ఈనెల 1న మృతి చెందాడు. ఈ కేసులో గ్రామానికి చెందిన గుగులోతు బాలాజీ, అజ్మీరా చిన్ని, బానోతు కౌసల్యతో పాటు ఓ మైనర్ బాలికను అరెస్టు చేసి బుధవారం ఖమ్మం జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు కారేపల్లి ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చింతకాని: చింతకాని మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఖమ్మంలో బుధవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ 32 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకుని చదువుతున్న కాలం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమలో పూర్వ విద్యార్థులు రావూరి సతీష్, గుండా కరుణాకర్, తిమ్మిశెట్టి మాధవరావు, చింతల గోవర్ధన్, బూర్లె హన్మంతరావు, కోట అప్పిరెడ్డి, కాశిబోయిన రామారావు, నర్ల శేషయ్య, లింగం కోటేశ్వరరావు, షేక్ ఖైరుల్‌వర, రాంబాయమ్మ, పాల్గొన్నారు.



బుధవారం కాకినాడలో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు కార్యక్రమానికి హాజరైన అశేష జనసందోహాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఊరు మారింది

ఇచ్ఛాపురం–కుప్పం.. ఏ ఊరైనా సరే.. మనం తెచ్చిన మార్పులు మీరే చూడండి: సీఎం జగన్

- కేవలం 55 నెలల కాలంలో పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం
- ఏ రాష్ట్రమూ ఇవ్వని విధంగా 66.34 లక్షల మందికి పింఛన్లు
- రూ.3,000 వైఎస్సార్ పింఛన్ కానుకను కాకినాడ నుంచి ప్రారంభించిన ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా 'వైఎస్సార్ పెన్షన్ కానుక' ద్వారా అవ్వా తాతలకు రూ.3,000 చొప్పున పింఛన్‌ను మన రాష్ట్రంలో మాత్రమే అందిస్తున్నామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మాట నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని పెంచి ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రతి నెలా 66.34 లక్షల మందికి టంఛన్‌గా ఇంటి వద్దే చేతిలో పెడుతున్నామన్నారు. ఇందుకోసం నెలకు రూ.2 వేల కోట్లు వరకు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పెన్షన్ మొత్తాన్ని పెంచడమే కాకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూరేలా పెన్షన్ల సంఖ్యను కూడా పెంచామన్నారు. నాడూ నేడూ.. ఇదే రాష్ట్రం, అంతే బడ్జెట్, నిరుపేదలూ అదే సంఖ్యలో ఉన్నా చంద్రబాబు హయాంలో మేలు చేయాలనే ఆలోచన ఎందుకు చేయలేదు? బటన్లు ఎందుకు నొక్కలేదు? ఇవాళ మీ బిడ్డ ఇవన్నీ ఎలా చేయగలుతున్నాడు? అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. అవ్వా తాతలకు పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచుకుంటూ వెళతానంటూ నాడు పాదయాత్రలో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్ బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందచేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, సీఎం జగన్ అభిమానుల ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీ వరకు ఈ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు.

> చంద్రబాబు హయాంలో పింఛన్ కేవలం రూ.1,000 మాత్రమే ఉండేది. గత ఎన్నికలకు రెండు నెలల ముందు మాత్రమే రూ.2 వేలు చేశారు. ఆ ఎన్నికలే రాకపోతే చంద్రబాబు పింఛన్ మొత్తాన్ని పెంచేవారా?
>
> -కాకినాడ సభలో సీఎం జగన్

ఈ సందర్భంగా కాకినాడకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనవాహినిని ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు.

క్యాలెండర్‌లో కాదు.. జీవితంలో మార్పు

అవ్వాతాతల పెన్షన్ రూ.3,000 వరకూ పెంచుకుంటూ పోతాం అని మేనిఫెస్టోలో చెప్పిన మాటను తు.చ. తప్పకుండా నెరవేరుస్తూ మీ అందరి సమక్షంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం దేవుడు నాకిచ్చిన అదృష్టంగా భావిస్తున్నా. కొత్త సంవత్సరం అంటే కేవలం క్యాలెండర్‌లో ఒక మార్పు మాత్రమే కాదు. కొత్త సంవత్సరం అంటే ప్రతి ఒక్కరి జీవితంలో ఆదాయం, ఆనందం పెరగాలి. మరింత మెరుగైన పరిస్థితుల్లోకి వెళ్లాలి. అలాంటి గొప్ప కార్యక్రమంలో ఇవాళ పాలు పంచుకుంటున్నా.

నా వలంటీర్ తమ్ముళ్లు, చెల్లెమ్మలు..

పెన్షన్ తీసుకుంటున్న వీళ్లందరి పరిస్థితిని ఒక్కసారి గమనిస్తే పెద్ద వయసు వల్ల గానీ, విధిరాత వల్ల గానీ తమను తాము పోషించుకోలేని పరిస్థితుల్లో తల్లడిల్లుతున్నారు. అటువంటి 66.34 లక్షల మంది అవ్వాతాతలకు, అభాగ్యులకు, వితంతువులకు మంచి చేస్తూ మన ప్రభుత్వం సామాజిక పెన్షన్‌ను రూ.3,000 చేసింది. ఈ రోజు మనం పెన్షన్ల కోసం ప్రతి నెలా చేస్తున్న ఖర్చు దాదాపు రూ.2 వేల కోట్లు. నెలలో ఒకటో తారీఖు మిగిలిన ప్రపంచానికి సెలవు, పండగ రోజు కావచ్చు కానీ మీ జగనన్న సైన్యం, నా వలంటీర్ తమ్ముళ్లు, చెల్లెమ్మలకు మాత్రం అది ప్రతి అవ్వాతాతల ముఖంలో చిరునవ్వు చూసే రోజు. సూర్యోదయానికి ముందే చిరునవ్వుతో గుడ్ మార్నింగ్ చెబుతూ ప్రతి అవ్వకు, తాతకు మంచి మనవడిగా, మనవరాలిగా చేయూతనిస్తున్న నా వలంటీర్లకు మాత్రం అది సెలవు రోజు కాదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మీ ఇష్టం.. ఏ గ్రామాన్నైనా తీసుకోండి

ఇవాళ రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి కుప్పం దాకా ఏ గ్రామాన్నైనా తీసుకోండి. మీ ఇష్టం.. ప్రతి గ్రామంలోనూ మార్పు కనిపిస్తోంది. అడుగు పెడుతూనే ప్రతి గ్రామంలోనూ గతంలో లేని విధంగా మార్పు కనిపిస్తూ గ్రామ సచివాలయం గోచరిస్తుంది. అందులో 10 మంది శాశ్వత ఉద్యోగులు కనిపిస్తారు. ప్రతి గ్రామంలోనూ వలంటీర్ వ్యవస్థతోపాటు ఇంటి వద్దకే అందుతున్న రేషన్, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ కనిపిస్తాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమూ కనిపిస్తుంది. నాడు–నేడుతో గ్రామంలో మారిపోయిన స్కూళ్లు, ఆస్పత్రులతో మన కళ్ల ఎదుటే మార్పులు కనిపిస్తాయి. మెరుగులు దిద్దిన 108, 104 కనిపిస్తాయి. గతంలో 1,050 రోగాలకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీని ఇవాళ 3,250 ప్రొసీజర్లకు వర్తింపచేస్తూ ప్రతి పేదవాడికి అండగా నిలబడ్డాం. రైతులకు పగటి పూటే ఉచిత కరెంటు 9 గంటలు ఇస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. చదువుకుంటున్న పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అండగా నిలబడుతున్నాం. వసతి దీవెనతో అండగా ఉన్న పరిస్థితులూ కనిపిస్తున్నాయి. పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, స్కూళ్లలో ఐఎఫ్‌పీ తరగతి గదులు కనిపిస్తాయి. కేవలం 55 నెలల కాలంలో మీ బిడ్డ పరిపాలనలో మాత్రమే చోటుచేసుకున్న మార్పులు ఇవన్నీ.

కుటుంబాలను చీల్చే కుట్రలు!

అలాంటి రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కుటుంబాలను చీల్చే రాజకీయ కుట్రల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మంచి చేయడం, పేదవాడికి అండగా నిలబడటమే మీ బిడ్డకు తెలిసిన రాజకీయం అని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ అబద్ధాలు చెబుతారని, పొత్తులతో మోసపూరితంగా మీ ముందుకు వస్తారని హెచ్చరించారు. అవ్వా తాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంపు సందర్భంగా బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో సీఎం జగన్ మాట్లాడారు.

అడ్డుకునే దిక్కుమాలిన ఆలోచన..

గతంలో ఒకాయన సీఎంగా ఉన్నాడు. ఆయనకో దత్తపుత్రుడూ ఉన్నాడు. ఆ దత్తపుత్రుడు, దత్త తండ్రి ఇద్దరూ కలిసి 2014 ఎన్నికలప్పుడు ప్రతి పేదవాడికీ 3 సెంట్ల స్థలం, ఇల్లు కట్టిస్తామని వాగ్దానం చేసి చివరికి ఒక్క సెంటు కూడా ఇచ్చిన పాపాన పోలేదు. అక్కచెల్లెమ్మలను, పేదవాళ్లను అడ్డగోలుగా మోసం చేస్తే ఈ దత్తపుత్రుడు ఏ ఒక్క రోజూ ప్రశ్నించకపోగా కేంద్రానికి ఒక లేఖ కూడా రాయలేదు. ఇవాళ మీ బిడ్డ 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చి 22 లక్షల ఇళ్లను కడుతూ అక్కచెల్లెమ్మల ముఖాల్లో సంతోషం చూడాలని కోరుకుంటుంటే ఈ దత్తపుత్రుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తాడు. పేదల కోసం కట్టే ఇళ్లలో, ఇంటి స్థలాల్లో అవినీతి జరిగిందంటూ ఆ కార్యక్రమాన్ని ఆపించాలనే దిక్కుమాలిన ఆలోచన చేయగలిగిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఈ అన్యాయస్తులు మాత్రమే!

ఆ అవినీతిలో.. పార్టనర్

చంద్రబాబు అవినీతిపరుడని సాక్షాత్తూ కేంద్ర ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఈడీ సమన్లు ఇచ్చాయి. కోర్టులు కూడా నిర్ధారించి అన్నీ పరిగణలోకి తీసుకుని ఆయన్ను జైల్లో పెడితే ఈ దత్తపుత్రుడు వెళ్లి దత్తతండ్రిని పరామర్శిస్తాడు. అంత అవినీతిపరుడు ప్రపంచంలో ఎక్కడా లేకపోయినా ఆ పెద్దమనిషి చాలా మంచోడని ఈయన సర్టిఫికెట్ ఇస్తాడు. అక్కడేమో అవినీతి జరిగినా మాట్లాడడు. ఇక్కడేమో అవినీతి జరగకపోయినా మన ప్రభుత్వంపై అభాండాలు వేస్తాడు. చంద్రబాబు అవినీతి చేసినా ఎందుకు నోరు మెదపడంటే.. ఆ అవినీతిలో ఈయన కూడా పార్టనర్ కాబట్టి! దీనిపై ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్తపుత్రుడు ప్రశ్నించరు, మాట్లాడరు.

బాబు ఎందుకు చేయలేదు?.. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు?

గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు నొక్కిన బటన్లు ఎన్ని? ఉత్త సున్నా! ఇవాళ మీ బిడ్డ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ పెన్షన్, ఇతర పథకాలు అందిస్తూ నేరుగా బటన్ నొక్కుతున్నాడు. నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయి. ఇంతవరకూ రూ.2.46 లక్షల కోట్లు నేరుగా జమ అయ్యాయి. ఎక్కడా లంచాలు లేవు. వివక్ష లేదు. మీ బిడ్డ ఎలా చేయగలిగాడు? చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడో ఆలోచించాలి. అప్పుడూ ఇప్పుడూ అదే రాష్ట్రం, అదే బడ్జెట్. చంద్రబాబు పాలనలో కన్నా మీ బిడ్డ ప్రభుత్వంలో అప్పుల గ్రోత్ రేటు తక్కువ. కేవలం మారిందల్లా ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న వ్యక్తి మాత్రమే. అప్పట్లో ఈ బటన్లు నొక్కే కార్యక్రమం ఎందుకు జరగలేదు? ఎందుకు రూ.2.46 లక్షల కోట్లు ఇవ్వలేకపోయారు? అప్పట్లో దోచుకోవడం, దోచుకున్నది పంచుకున్నది తప్ప పాలన జరగలేదు. అప్పట్లో ఒక గొప్ప గజదొంగల ముఠా పాలన చేసేది. అప్పట్లో డీపీటీ (దోచుకో, పంచుకో, తినుకో) జరిగితే మీ బిడ్డ హయాంలో డీబీటీ జరుగుతోంది.

జిల్లా వార్తలు

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోలతో పోలీసు అధికారులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు పరమేశ్వరన్ తిలాకావర్, హేమంత్‌ప్లాష్, 208 కోబ్రా అసిస్టెంట్ కమాండెంట్ బుధవారం వివరాలు వెల్లడించారు. కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధి పుట్టపాడుకు చెందిన మావోయిస్టు మిలీషియా, డీఏకేఎంఎస్‌కు చెందిన కల్మ జోగా, కల్మ దూల లొంగిపోయారని తెలిపారు. వీరిద్దరు దండకారణ్యంలో పలు విధ్వంసకర ఘటనలకు పాల్పడిన కేసుల్లో నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.40లక్షల విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానానికి తమిళనాడుకు చెందిన భక్తులు బుధవారం విరాళం అందచేశారు. చెన్నైకి చెందిన చలసాని కృష్ణచైతన్య రూ.1.40లక్షలను ఆలయ అధికారులకు అందజేయగా, వారు రశీదు ఇచ్చి స్వామి దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు శ్రావణ్‌కుమార్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6న భద్రాద్రి రామయ్యకు రాజఖడ్గం

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామికి ఈనెల 6న సత్యాత్మ తీర్థ స్వామిజీ ఆధ్వర్యాన రాజఖడ్గ సమర్పణ కార్యక్రమం జరగనుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. గోదావరి నదీస్నానం, సంస్థాన పూజ, శ్రీపాదులవారి ఆలయ మర్యాదల ప్రకారం రామయ్యకు ప్రత్యేక పూజలు చేశాక వేద పండితుల ఆధ్వర్యాన సత్యాత్మ తీర్థ స్వామిజీ ఉత్తరాది మఠం తరఫున భద్రాద్రి రామయ్యకు రాజఖడ్గం సమర్పిస్తారని పేర్కొన్నారు.

ముందే వచ్చిన పండుగ!

- ఉద్యోగుల అకౌంట్లలో వేతనాలు జమ
- ఏళ్ల తర్వాత మొదటి వారంలో జీతాలు
- బకాయిలు, సెలవులపై ప్రభుత్వ నిర్ణయంతో హర్షాతిరేకాలు

ఇల్లెందురూరల్: శ్రమకు తగిన ఫలితం సకాలంలో చేతికందితే ఆ సంబరమే వేరు. కానీ నెల పాటు శ్రమించినా మరుసటి నెల ప్రారంభంలో చిల్లర కోసం జేబులు వెతుక్కోవాల్సి వస్తే ఆ ఇబ్బంది చెప్పనలవి కాదు. ఇది ప్రభుత్వ ఉద్యోగులైనా, ప్రైవేట్ ఉద్యోగుల్లోనైనా సహజంగా కనిపిస్తుంది. అయితే, రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లుగా ఉద్యోగులకు నెల ప్రారంభమైన పది రోజుల తర్వాతే వేతనాలు జమ చేయడం ఆనవాయితీగా మారింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు నెలవారీ చెల్లింపులు, రుణాల ఈఎంఐలు చెల్లించేందుకు నానా అగచాట్లు పడ్డారు. కాగా, కొత్త ప్రభుత్వం ఇటీవల కొలువుదీరగా సంక్రాంతి పండుగ జరుపుకోనున్న ఈ నెలలో ఆనందపడేలా ఆరంభంలోనే వేతనాలు జమ అయ్యాయి.

రోజుల తరబడి ఎదురుచూపులే..

స్వరాష్ట్రంలో తొలి అయిదేళ్లు వేతన జీవులకు సకాలంలోనే వేతనాలు జమ అయ్యేవి. కానీ ఆ తర్వాత మాత్రం ఉద్యోగులు వేతనాల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో సందర్భంలో పదిహేను రోజులు దాటిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించలేక బ్యాంకుల నుంచి వరుస పెట్టి మెసేజ్‌లు వస్తుండేవి. అయితే, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తొలినెలలోనే వేతనాలు నెల మొదట్లోనే జమ కావడంతో ఉద్యోగుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గడిచిన ఐదేళ్లలో ఇలా జరగడం ఇదే తొలిసారి అని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం

బకాయిలపైనా ఆనందం

ప్రభుత్వ ఉద్యోగులు చాన్నాళ్లుగా వేతనాలతోపాటు బకాయిల కోసం కూడా ఎదురుచూడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే నెలారంభంలోనే వేతనాలు చెల్లించారు. ఈ క్రమంలోనే ఉద్యోగులు ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్‌లు, డీఏ బకాయిలు, పీఆర్‌సీ బకాయిల అంశాన్ని కూడా పరిష్కరించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో త్వరలోనే బకాయిలు అందుతాయని భావిస్తున్నారు.

సెలవుల విషయంలోనూ..

గతంలో ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ఉద్యోగులతో నిర్విరామంగా పని చేయించేదనే విమర్శలు వచ్చాయి. ప్రకటించిన తేదీల్లో సెలవులు వచ్చినా, పండుగలు వచ్చినా ఉద్యోగులు విధులకు హాజరు కావాల్సివచ్చేది. కానీ ప్రస్తుతం ప్రజాపాలన గ్రామసభలు గత నెల 28వ తేదీన ప్రారంభం కాగా, డిసెంబర్ 31న ఆదివారంతో పాటు జనవరి 1న నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా విరామం ప్రకటించడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్ల తర్వాత ఇప్పుడే...



గడిచిన ఐదేళ్లలో నెలారంభంలో వేతనాలు అందడం ఇదే తొలిసారి. ఈనెల 3వ తేదీన నా అకౌంట్‌లో వేతనం జమ కావడం సంతోషంగా ఉంది. ఇది నిరంతరం కొనసాగించాలి. తద్వారా ఉద్యోగులు ఉత్సాహంగా విధులు నిర్వర్తిస్తారు.

– లక్ష్మీప్రసన్న, సీడీపీఓ, ఇల్లెందు మండలం

సెలవులపై నిర్ణయం బాగుంది



గతంలో సెలవులతో సంబంధం లేకుండా విధులకు హాజరయ్యేవాళ్లం. కనీసం పండుగల రోజైనా ఇంటి వద్ద గడిపేందుకు అవకాశం చిక్కేది కాదు. కానీ ఈసారి నూతన సంవత్సర వేడుకలను కుటుంబంతో కలిసి జరుపుకున్నాం.

– రజినీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఇల్లెందు మండలం

బకాయిల సమస్య పరిష్కరించాలి



గడచిన ఏడాది కాలంగా ఉద్యోగులకు సంబంధించి సమస్యలు పేరుకుపోయాయి. ప్రధానంగా మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్‌లు, డీఏ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు పెండింగ్ ఉన్నాయి. కొత్త ప్రభుత్వం వీటిని కూడా పరిష్కరించాలి.

–సతీష్, వ్యవసాయశాఖ అధికారి, ఇల్లెందు మండలం

ఎర్రుపాలెంలో 'శాతవాహన'కు హాల్టింగ్ ఇవ్వాలి



కేంద్ర మంత్రికి లేఖ అందజేస్తున్న ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇవ్వాలని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వర రావు కోరారు.

ఈ సందర్భంగా బుధవారం ఆయన ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ అందజేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం పరిధి డోర్నకల్–విజయవాడ మార్గంలో ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ ఉండగా, ఇక్కడి నుంచి సమీపంలో ఉన్న జమలాపురంలోని వెంకటేశ్వర స్వామి దర్శనానికి ఏటా 10 లక్షల నుంచి 15 లక్షల మంది భక్తులు వస్తారని తెలిపారు. ఈమేరకు ఎర్రుపాలెంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇస్తే భక్తులకు సౌకర్యం ఉంటుందని వివరించారు.

ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలి

కల్లూరు: అర్ధ శతాబ్ది క్రితం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్.కాంతేశ్వరరావు కోరారు. కల్లూరులో బుధవారం ఏర్పాటుచేసిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయనమాట్లాడారు. నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులు, అమరులు, జైలు శిక్ష అనుభవించడమే కాక ఉద్యోగాలు కోల్పోయిన వారందరికీ సంక్షేమ రాయితీలు, ఆర్థిక చేయూత అందచేయాలని కోరారు. ఇందుకోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తల్లపురెడ్డి నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శీలం మోహనరెడ్డి, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గులామ్ జాఫర్, కృష్ణబాబు ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలకు రెడీ!



పోటీలకు ముస్తాబైన కిన్నెరసాని క్రీడాపాఠశాల మైదానం

- నేటి నుంచి కిన్నెరసానిలో క్రీడాపోటీలు
- హాజరుకానున్న 1,500మంది విద్యార్థులు

పాల్వంచరూరల్: మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి గిరిజన పాఠశాలల విద్యార్థుల క్రీడాపోటీల కోసం పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన నిర్వహించనున్న నాలుగో వార్షిక రాష్ట్రస్థాయి గిరిజన విద్యార్థుల క్రీడోత్సవాలు గురువారం నుంచి శనివారం జరగనున్నాయి. ఈమేరకు ఏర్పాట్లను గిరిజన సంక్షేమ డీడీ మణెమ్మ బుధవారం పరిశీలించి మాట్లాడారు. క్రీడల నిర్వహణ సాఫీగా సాగేలా 24 కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు, పీఈటీలు, అధికారులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు ఉంటాయని పేర్కొన్నారు.



పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీడీ మణెమ్మ, అధికారులు

క్రీడామైదానం ముస్తాబు

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణ కోసం కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో మైదానాలను సిద్ధం చేశారు. నాలుగు ఐటీడీఏల పరిధిలోని పాఠశాలల నుంచి 1,500 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. ఎనిమిది అంశాల్లో పోటీలు నిర్వహిచనుండగా, 400 మంది పీఈటీలు, పీడీలు, కోచ్‌లు కూడా పాల్గొంటారు.

బౌద్ధక్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ఉన్న దక్షిణ భారతదేశంలో కెల్లా అతిపెద్దదైన బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని శ్రీ గౌతమి బుద్ధ సొసైటీ బాధ్యులు కోరారు. ఈమేరకు సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ కట్టెకోల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆసిఫ్ అలీషేక్ బుధవారం హైదరాబాద్‌లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బౌద్ధక్షేత్రంలో బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయడంతో ప్రధాన ద్వారం వద్ద ఆర్చి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సొసైటీ ప్రతినిధులు

అశ్వాపురం బ్రాంచ్‌ను సందర్శించిన డీసీసీబీ చైర్మన్, సీఈఓ

అశ్వాపురం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అశ్వాపురం బ్రాంచ్‌ను డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీఈఓ రెహమాన్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించాక వారు మేనేజర్, ఉద్యోగులతో సమావేశమయ్యారు. బ్రాంచ్‌లో లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగులు చైర్మన్, సీఈఓను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కృష్ణమోహన్, నెల్లిపాక పీఏసీఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, అశ్వాపురం బ్రాంచ్ మేనేజర్ బాలరాజుతోపాటు సునీల్, జ్ఞానేందర్, చైతన్య, కమటం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాంచ్ ఉద్యోగులతో చైర్మన్, సీఈఓ